# శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం

## అడ్మిన్  ఆఫీసు , ములుగు (గ్రామం & మండలం), సిద్దిపేట్ జిల్లా – తెలంగాణ

### తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి వాతావరణ ఆధారిత ఉద్యాన సలహాలు

**02-04-2026 నుండి 08-04-2026**

**రాష్ట్రంలో గత రెండు రోజుల వాతావరణం:**

- రాష్ట్ర వ్యాప్తంగా వాతావరణం పొడిగా ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 34 నుండి 36 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రతలు 23 నుండి 24 డిగ్రీల సెల్సియస్ గాను నమోదయ్యాయి.

**వచ్చే ఐదు రోజుల వాతావరణ సూచన:**

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వారు అందించిన సమాచారం ప్రకారం పగటి ఉష్ణోగ్రతలు 36 నుండి 38 డిగ్రీల సెల్సియస్ మధ్య మరియు రాత్రి ఉష్ణోగ్రతలు 23 నుండి 26 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదుకావచ్చు.

**కూరగాయల పంటలలో వాతావరణ ఆధారిత సూచనలు**

**సాధారణ యాజమాన్య పద్ధతులు**

- మార్చి చివరలో వచ్చే ముందస్తు రుతుపవన ఉరుములు లేదా గాలివానల పట్ల అప్రమత్తంగా ఉండి, పంటలను గాలి మరియు వడగళ్ళ నుండి రక్షించుకోవాలి.
- నర్సరీలు మరియు సున్నితమైన పంటలపై 50% షేడ్ నెట్లు అమర్చి ఎండ తీవ్రతను తగ్గించాలి. భూమిలో తేమను కాపాడటానికి తెల్లవారుజామున లేదా సాయంత్రం వేళల్లో తక్కువ విరామంతో నీటి తడులు ఇవ్వాలి.
- నీటి పొదుపు కోసం డ్రిప్ ఇరిగేషన్ మరియు తేమను నిలిపి ఉంచడానికి మల్చింగ్ (ఎండుటాకులు లేదా ప్లాస్టిక్) వాడాలి.
- తెగుళ్ళు మరియు పురుగుల నివారణకు లోతు దుక్కులు చేయాలి. పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- కలుపు నివారణ మరియు మట్టిని ఎగదోయడం వంటి పనులు చేపట్టాలి. వేడి మరియు గాలి తీవ్రతను తట్టుకోవడానికి ప్రతి ఐదు వరుసల కూరగాయల పంట తర్వాత మొక్కజొన్నను సరిహద్దు పంటగా వేసుకోవాలి.

**పురుగులు మరియు తెగుళ్ల యాజమాన్యం**

- **రసం పీల్చే పురుగులు** - తెల్లదోమ మరియు నల్ల తామర పురుగుల ఉధృతిని గమనించడానికి ఎకరాకు 20 పసుపు మరియు 20 నీలిరంగు జిగురు అట్టలను ఏర్పాటు చేయాలి.
- టమాటా, వంగ, మిర్చి - అఫిడ్స్ (పేనుబంక) మరియు తెల్లదోమ నివారణకు ఇమిడాక్లోప్రిడ్ @ 0.3 మి.లీ/లీ లేదా ఫిప్రోనిల్ @ 2 మి.లీ/లీ నీటిని కలిపి పిచికారీ చేయాలి.
- **నల్ల తామర పురుగులు** - వీటి నివారణకు స్పినెటోరమ్ @ 1.0 మి.లీ/లీ లేదా బవేరియా బాసియానా @ 5 గ్రా/లీ చొప్పున వాడాలి.
- **కాయ తొలుచు పురుగు మరియు ఆకుమచ్చ పురుగు** - ఫ్లూబెండియమైడ్ + థయాక్లోప్రిడ్ @ 0.5 మి.లీ/లీ లేదా స్పినోసాడ్ @ 0.3 మి.లీ/లీ చొప్పున పిచికారీ చేయాలి.

- **మొజాయిక్ వైరస్ తెగులు** - బెండ మరియు తీగ జాతి (దోస, సొరకాయ, బీరకాయ, కాకరకాయ) పంటల్లో వైరస్‌ను వ్యాప్తి చేసే దోమల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 17.8 SL @ 0.3 మి.లీ/లీ లేదా ఎసిటామిప్రిడ్ 20 SP @ 0.3 గ్రా/లీ వాడాలి.
- **తుప్పు తెగులు** - చిక్కుడు జాతి పంటల్లో (చిక్కుడు, గోరు చిక్కుడు , ఫ్రెంచి బీన్స్, అలసందలు) తుప్పు తెగులు నివారణకు హెక్సాకోనజోల్ 5 EC @ 1 మి.లీ/లీ లేదా టెబుకోనజోల్ 25 EC @ 1 మి.లీ/లీ పిచికారీ చేయాలి.
- **మిరప** - పూర్తిగా ఎర్రగా పండిన దశలో మాత్రమే కోతచేయాలి. మంచిరంగు, నాణ్యత మరియు ఎక్కువ ఎండు మిరప కోసం కోతకు ముందు 7–10 రోజులు నీటి పట్టింపును ఆపాలి. కాయలలో పొడి పదార్థం పెరిగి ఎండబెట్టడం సులభమవుతుంది. కోత చేసిన కాయలను తెగుళ్ల సోకిన నుండి వేరు చేసి టార్పాలిన్ షీట్ లేదా సిమెంట్ నేల పై 8–10% తేమ వచ్చే వరకు ఎండబెట్టాలి.
- **బంగాళదుంప** - మార్కెట్‌కు పంపే ముందు గడ్డలను గ్రేడింగ్ (రకాలుగా విభజించడం) చేయాలి. పాడైపోయిన లేదా దెబ్బతిన్న గడ్డలను ఏరివేసి చల్లని ప్రదేశంలో భద్రపరచండి.

## పండ్లు

- **మామిడి** - పండు అభివృద్ధిదశ (గుడ్డుదశలో), చెట్టు కాండం నుండి 1 మీటరు దూరంలో బిందుసేద్యం ద్వారా 4 గంటల పాటు నీటిని అందించాలి. పాదుల ద్వారా నీటిపారుదల ఉన్నతోటల విషయంలో 15 రోజుల వ్యవధికి ఒకసారి తడులను అందించాలి. తామర పురుగులు వంటి రసం పీల్చే పురుగుల వ్యాప్తి ఉన్నప్పుడు, లీటరు నీటికి 0.5 గ్రాముల చొప్పున థియామెథాక్సామ్ లీటరు నీటికి 2 మిల్లీ లీటర్లచొప్పున ఫిప్రోనిల్ మందును పిచికారీ చేయాలి. కాయల పైన పక్షి కన్నుతెగులు (ఆంత్రాక్నోస్) మచ్చల వ్యాప్తిని నియంత్రించడానికి లీటరుకు 2 గ్రాముల చొప్పున కార్బెండజిమ్ + మాంకోజెబ్ మిశ్రమం పిచికారీ చేయాలి. తామర పురుగులను సమర్థవంతంగా నియంత్రించడానికి ఎకరానికి 10 చొప్పున నీలి రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలి. గుడ్డు పరిమాణంలో ఉన్న పండ్లను పురుగులు, వ్యాధుల వ్యాప్తి మరియు అకాలవర్షాల నుండి రక్షించడానికి పండ్లరక్షణ సంచులతో (fruit bags) కప్పాలి. సంచులను పండుకాడ చివర నుండి 2-3 సెంటీ మీటర్ల ఎత్తులో కట్టాలి. పండు ఈగల సమర్థవంతమైన నియంత్రణ కోసం, ఎకరానికి 6 నుండి 10 చొప్పున మిథైల్యూజెనాల్ ఫెరోమోనే ఉచ్చులను అమర్చండి.

- **నిమ్మ మరియు బత్తాయి** - నిమ్మ మరియు బత్తాయి తోటలలో కాయ రాలకుండా నివారించడానికి మరియు కాయ చక్కగా పెరగడానికి వారానికి ఒకసారి నీటి తడి అందించాలి. నిమ్మలో గజ్జితెగులు గమనించినట్లయితే, తెగులు సోకిన కొమ్మలు మరియు ఆకులను తొలగించి నాశనం చేయాలి. కాపర్ ఆక్సిక్లోరైడ్ 50 WP @ 30 g + స్ట్రెప్టోసైక్లిన్ 1 g 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. బత్తాయిలో మంగు నివారణకు, సల్ఫర్ (3 g/l) లేదా ఓమైట్ (2 ml/l) లేదా డైకోఫాల్ (5 ml/l) లేదాఫాసలోన్ (3 ml/l) పిచికారీచేయాలి.

### ఔషధ మరియు సుగంధ మొక్కలు

- **అలోవెరా** - పంట కోతకు సిద్ధంగా ఉంటుంది. ఇది బహువార్షిక పంట కావున, ప్రతి 4 నెలలకు ఒకసారి తదుపరి కోతలు చేపట్టాలి.
- **అశ్వగంధ** - పొలం లేఅవుట్ సిద్ధం చేసి విత్తనాలను విత్తాలి. విత్తే ముందు విత్తనాలను థైరమ్ (Thiram) లేదా డైథేన్-45 (Dithane-45) మందులతో 3 గ్రా/కిలో **విత్తనం** మోతాదులో శుద్ధి చేయాలి. ఇలా చేయడం వల్ల విత్తనాల ద్వారా వచ్చే వ్యాధుల నుండి మొక్కలు రక్షించబడతాయి.
- **లెమన్‌గ్రాస్** - భూమి సిద్ధం చేసి స్లిప్‌లను నాటుకోవాలి.
- **జెరానియం** - అవసరాన్ని బట్టి నీటిపారుదల అందించి, కలుపు నివారణ మరియు అవసరమైన మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలి.
- **పుదీనా** - సరైన పరిపక్వ దశలో బహుళ కోత (మల్టీకట్) పద్ధతిని అనుసరించాలి..
- **తులసి** - ఖాళీ ప్రదేశాల్లో కొత్త మొక్కలు నాటాలి (గ్యాప్ ఫిల్లింగ్) మరియు బలహీనమైన మొక్కలను మార్చి సమానమైన మొక్కల పెరుగుదల కలిగేలా చూడాలి.
- **వాము** - రబీ పంట కోత తర్వాత 2-3 రోజులు ఆరబెట్టి, ఆపై నూర్పిడి మరియు శుభ్రం చేసిన విత్తనాలను గన్నీ సంచులలో భద్రపరచండి.
- **ధనియాలు** - చలికాలం చివరలో విత్తిన ధనియాల పంటకు ఎండల తీవ్రత నుండి రక్షణ కోసం క్రమం తప్పకుండా తేలికపాటి నీటి తడులు ఇవ్వండి.పంట ఏపుగా పెరగడానికి పొలంలో ఉన్న కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసివేసి శుభ్రంగా ఉంచండి.రబీ పంట కోత తర్వాత 2-3 రోజులు ఆరబెట్టి, ఆపై నూర్పిడి మరియు శుభ్రం చేసిన విత్తనాలను గన్నీ సంచులలో భద్రపరచండి.
- **మెంతులు** - పంట పూత మరియు కాయ దశలో ఉన్నప్పుడు తేలికపాటి నీటి తడులు అందించాలి. పంట శారీరక పక్వదశకు చేరుకున్నప్పుడు కోతను ప్రారంభించాలి. కోత కోసిన తర్వాత, ఆ మొక్కలను పొలంలోనే 2 నుండి 3 రోజుల పాటు ఆరబెట్టాలి.
- **ఆయిల్‌పామ్** - పెరిగిన ఆయిల్‌పామ్ తోటల్లో ప్రతి మొక్కకు రోజుకు 160–200 లీటర్ల నీరు ఇవ్వాలి, పరిపక్వ తోటల్లో నెలకు ఒకసారి ఫర్టిగేషన్‌గా ప్రతి ఎకరానికి యూరియా 5 కిలోలు, డి.ఏ.పీ 3 కిలోలు, ఎం.ఓ.పీ 5 కిలోలు, మెగ్నీషియం సల్ఫేట్ 1.2 కిలోలు మరియు బోరాక్స్ 240 గ్రాములు డ్రిప్ ద్వారా ఇవ్వాలి.

## పూలు

- **గ్లాడియోలస్ -** పూలు కోసిన నలబై ఐదు రోజుల తర్వాత, ఆకులు పసుపు రంగులోకి మారడం ప్రారంభించగానే, ఒక వారం పాటు నీరు పెట్టడం నిలిపివేయాలి. దుంపలను త్రవ్వి తీయడానికి ఒక రోజు ముందు, నేల మెత్తబడేలా కొద్దిగా నీరు పెట్టి, ఎండిన కాడలను కత్తిరించాలి. కుర్పి లేదా పార ఉపయోగించి, చిన్న పిల్ల దుంపలతో పాటు దుంపలను జాగ్రత్తగా త్రవ్వి తీయాలి. ఆ తర్వాత ఎండిన తల్లి దుంపల నుండి కొత్త పిల్ల దుంపలను వేరు చేయాలి. ఈ దుంపలను శుభ్రంగా కడిగి, బావిస్టిన్ లేదా కార్బెండజిమ్ వంటి శిలీంధ్ర సంహారిణితో శుద్ధి చేయాలి. ఆపై వాటిని నీడలో పూర్తిగా ఆరబెట్టి, గాలి బాగా ఆడే ప్రాదేశంలో లేదా ఉల్లిగడ్డలు నిల్వ చేసే సంచులను నిల్వ చెయ్యడానికి ఉపగించవచ్చు.

- **రజనీగంధ -** రజనీగంధలో కాండం కుళ్ళు మరియు దుంప కుళ్ళు తెగుళ్ల నివారణకు, నేలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. అధిక తేమ ఈ వ్యాధుల పెరుగుదలకు అనుకూలిస్తుంది కాబట్టి నీటి పారుదల బాగా ఉండేలా చూసుకోవాలి. వ్యాధి సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి మరియు నాటే ముందు దుంపలను కార్బెండజిమ్ లేదా బావిస్టిన్ వంటి శిలీంధ్ర సంహారిణులతో దుంపలను శుద్ధి చేయాలి. ఈ తెగులు వ్యాప్తిని అరికట్టడానికి, లక్షణాలు తొలిదశలో కనిపించిన వెంటనే కార్బెండజిమ్ లేదా మెటాలాక్సిల్తో నేలంతా తడపాలి. తామర పురుగులు మరియు పేనుబంక రాకుండా ముందు జాగ్రత్త చర్యగా, లీటరు నీటికి 1.5 మి.లీ. డైమిథోయేట్ లేదా 1.5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.